క్లుప్తంగా

అన్నసమారాధన



అన్నసమారాధనలో పాల్గొన్న భక్తులు

ఎచ్చెర్ల క్యాంపస్: దుర్గా దేవీ శరన్నవరాత్రుల్లో భాగంగా కుశాలపురంలో ఆదివారం అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎస్ఎస్ఆర్ చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపక అధ్యక్షుడు సూర శ్రీనివాసరావు ఆర్థిక సహకారం అందించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

నేడు వెలగాడలో జగనన్న ఆరోగ్య సురక్ష

జి.సిగడాం: మండలంలోని బాతువ ఆరోగ్య కేంద్రం పరిధిలోని వెలగాడ సచివాలయంలో సోమవారం ఉదయం 9 గంటలకు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ మేరకు ఎంపీపీ మీసాల సత్యవతి గురువారం తెలిపారు. గ్రామంలో ఉన్న దీర్ఘకాలిక రోగులు హాజరై వైద్య పరీక్షలు చేసుకోవాలని కోరారు.

పట్టుబడిన జూదరులు

శ్రీకాకుళం క్రైమ్: నగరంలోని కంద్రవీధి వెనుక నాగావళి నదీ తీరంలో ఆదివారం రాత్రి పేకాట ఆడుతూ ఐదుగురు జూదరులు పట్టుబడినట్లు ఎస్సై బలివాడ గణేష్ తెలిపారు. వీరి వద్ద నుంచి రూ. 35 వేలు నగదు, ఆ

అలరించిన విద్యార్థుల ప్రదర్శనలు



ప్రదర్శనలో విద్యార్థులు రు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామన్నారు.

శ్రీకాకుళం న్యూకాలనీ: పాఠశాల స్థాయి నుంచే పరిశోధనల పట్ల విద్యార్థులు ఆసక్తి పెంచుకోవాలని విశాఖ స్కూల్ చైర్మన్ కె.మధుసూదన్ అన్నారు. శ్రీకాకుళం నగరంలోని బ్యాంకర్స్ కాలనీలో గల సాయి ప్రియ దర్శినీ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో నడపబడుచున్న విశాఖ స్కూలులో స్టూడెంట్ లెడ్ కాన్ఫరెన్స్ (ఎస్ఎల్‌సీ) పేరిట ఆదివారం విద్యార్థుల తల్లిదండ్రుల సమక్షంలో ప్రత్యేక కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రాజెక్టులతోపాటు, ఫండమెంటల్ రైట్స్, మన పరిసరాలు మనం పరిశుభ్రంగా ఉంచుకుందాం లాంటి స్కిట్స్ ప్రదర్శించి ఆహూతులను అలరించారు. వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ గీత, పాఠశాల హెచ్‌ఎం పి.రామారావు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న వేషధారణలు



వివిధ వేషధారణలు

ఆమదాలవలస: స్థానిక మున్సిపాలిటీ పరిధి గేదెలవానిపేటలో నిర్వహిస్తున్న నందన్న ఉత్సవాల సందర్భంగా శనివారం గ్రామంలో గల యువకులు, వృద్ధులు వివిధ వేషధారణల్లో అలరించారు. ఈ సందర్భంగా అన్నమాచార్యునితో సహా వేంకటేశ్వరస్వామి, పద్మావతి, అలివేలు మంగమ్మ వేషధారణలు ఆకట్టుకున్నాయి.

ఆధ్యాత్మికతపై దృష్టిపెట్టాలి



రామారావును సన్మానం చేస్తున్న గ్రామస్తులు

సోంపేట: మనిషి మనుగడకు ఆధ్యాత్మికత అవసరమని ఆధ్యాత్మికవేత్త నల్లకూర్మారావు అన్నారు. ఆధ్యాత్మికతపై యువత దృష్టిపెట్టాలన్నారు. ఉప్పలాం పంచాయతీ ఎకువూరు గ్రామంలోని వీరబ్రహ్మేంద్ర స్వామి దేవాలయం ఆవరణలో గురుపౌర్ణమి నుంచి ఆదివారం వరకు శ్రీమద్రామాయణం ప్రవచనాన్ని కూర్మారావు నిర్వహించారు. భక్తులను ఆకట్టుకునేలా రామాయణంలోని సన్నివేశాలు వివరించారు. ముగింపు వేడుకల్లో భాగంగా కూర్మారావుకు గ్రామస్తులు రూ. 12 వేల విలువైన వెండితో తయారు చేసిన శ్రీరామ పట్టాభిషేకం మూర్తులు అందజేసి, దుశ్శాలువతో సత్కరించారు. అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

మంచినీటి కష్టాలకు చెక్!

- నులువుగా కుళాయి కనెక్షన్ మంజూరు
- మంత్రి ధర్మాన చొరవతో తీరుతున్న నీటి వెతలు



కుళాయి పైప్‌లైన్ పనులు చేస్తున్న సిబ్బంది

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): బిందెడు మంచినీటి కోసం శ్రీకాకుళం నగర వాసులు అష్టకష్టాలు పడేవారు. నదీతీర ప్రాంతవాసుల కష్టాలు మరీ దారుణంగా ఉండేవి. తీరంలో చలమలు తవ్వుకొని ఊట నీటిని తెచ్చుకుని అవసరాలు తీర్చుకునేవారు. ఇప్పుడు అలాంటి కష్టాలు పూర్తిగా కనుమరుగయ్యాయి. మంచినీటి కష్టాలకు చెక్‌పెట్టాలన్న ఆలోచనతో 2011 సంవత్సరంలోనే ఆదివారంపేట వద్ద మంత్రి ధర్మాన ప్రసాదరావు చొరవతో రూ.38 కోట్లతో రక్షిత మంచినీటి పథకం పనులు చేపట్టారు. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఇంటిగ్రేటెడ్ వాటర్ సప్‌లై స్కీమ్ కింద వంద కోట్ల రూపాయలతో నీటి వనరుల కల్పనకు శ్రీకారం చుట్టారు. విలీన పంచాయతీలను కలుపుకుని కార్పొరేషన్ పరిధిలో ఏఒక్కరి నుంచి కుళాయి కనెక్షన్ లేదు, తమకు నీరు రావడం లేదనే మాట వినిపించకుండా చేసేందుకు మరో అంకానికి తెరలేపారు. అదే ఇప్పుడు డీపీఆర్‌లో ఉంది. తొలిప్రాధాన్యతగా పెద్దపాడు, పాత్రునివలస చుట్టపక్కల ప్రాంతాలకు నీరందించేందుకుగాను సుమారు రూ. 25 కోట్లతో డీపీఆర్ అప్రూవల్ స్టేజ్‌లో ఉంది. ఆదివారంపేట, బలగ, ఖాజీపేట, హెడ్‌వాటర్‌వర్క్స్ పనులు పూర్తిచేసి ప్రతి ఒక్క ఇంటికి మంచినీటిని అందించే దిశగా వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. దరఖాస్తు చేసుకున్న వారం రోజుల్లోనే కుళాయి కనెక్షన్ అందించేలా కార్పొరేషన్ అధికారులు చర్యలు చేపట్టారు. మంత్రి ధర్మాన ప్రసాదరావు చొరవతో నీటి వెతలు తీరుతుండడంతో నగర వాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

కావాల్సిన పత్రాలివే..

కుళాయి కనెక్షన్ మంజూరు కోసం కొన్ని పత్రాలను ఇవ్వాల్సి ఉంటుంది. ఇటీవల చెల్లించిన ఇంటి పన్ను, ఆధార్ జిరాక్స్ కాపీలు, రూ. 50 నాన్‌జ్యూడిషియల్ స్టాంప్‌పేపర్ (ఈ-స్టాంపింగ్), ఇంటి డాక్యుమెంట్ ఉండాలి.

నీటి కేటాయింపు ఇలా..

ఒక మనిషికి రోజుకి 127 లీటర్ల నీటిని అందిస్తున్నారు. అలాగే ఒక కుటుంబానికయితే సుమారు 500 లీటర్లను అందజేస్తారు.

- విలీన ఏడు పంచాయతీలతో కలుపుకుని 18.08 ఎమ్ఎల్‌డీ మిలియన్ లీటర్స్ డెయిలీ (1.88 కోట్ల లీటర్లు) రోజుకి సరఫరా చేస్తున్నారు.

కుళాయి కనెక్షన్ల వివరాలు

నగరంలో 21,447 కుళాయి కనెక్షన్లు, పబ్లిక్ కుళాయిలు కనెక్షన్లు 412 ఉండగా.. చేతిపంపులు 330 ఉన్నాయి.

మోటార్ కనెక్షన్లపై అధికారుల చర్యలు

కుళాయిలకు అక్రమంగా విద్యుత్ మోటార్లను అమర్చి నీటిని పంపింగ్ చేసే అంశంపై కార్పొరేషన్ నీటి విభాగం అధికారులు అప్రమత్తమయ్యారు. అక్రమంగా నీటిని మోటార్లతో తోడేయడం వల్ల హైడ్రాలిక్స్ దెబ్బతింటున్నాయి. దీంతో అందరికి తగినంతగా నీరు రాక ఇబ్బందులు పడాల్సి వస్తుంది. ఈ నేపథ్యంలో కార్పొరేషన్ అధికారులు టాస్క్‌ఫోర్స్ బృందంగా ఏర్పడి అక్రమ మోటార్లను గుర్తించే చర్యలు తీసుకుంటున్నారు. వారి దృష్టిలో పడినట్లయితే శాశ్వతంగా కుళాయి కనెక్షన్‌ను తొలగిస్తున్నారు. తొలిసారిగా రూ. రెండు వేలు, రెండోసారి రూ. పది వేలు జరిమానా, మోటారు జప్తు, మూడోసారి జీవితకాలం నీటికుళాయి కనెక్షన్ ఇవ్వకుండా రద్దు చేస్తున్నారు.

కుళాయి కనెక్షన్ మంజూరు ఇలా..

రూ. 500 కంటే ఇంటిపన్ను తక్కువ ఉంటే..	రూ. 500 కంటే ఎక్కువున్నవారు..
దోనేషన్‌గా రూ. 200	రూ. 6 వేలు
అడ్వాన్స్ -	రూ. 600
ఎస్టిమేట్‌చార్జీలు -	రూ. 1155
అప్లికేషన్ ఫీజు రూ. 50	రూ. 50

మంచినీటి సమస్యలేని నగరంగా శ్రీకాకుళం



ప్రతి ఇంటికి మంచినీటి కుళాయి కనెక్షన్ ఇవ్వడమే తమ లక్ష్యం. నిరుపేదలకు 250 రూపాయలకే వారం రోజుల్లో కుళాయి కనెక్షన్ వేస్తున్నాం. రోజూ రెండు పూటలా నీటిని సరఫరా చేసి ఇబ్బంది లేకుండా చూస్తున్నాం. అలాగే ఇంటిగ్రేటెడ్ వాటర్ సప్‌లైయ్ స్కీమ్ కింద రూ. 100 కోట్లకు పైగా నిధులతో పనులు చేపట్టేందుకు ప్రతిపాదనలు పంపించాం. ప్రభుత్వం నుంచి ఆమోదం వస్తే పనులు చేపడతాం. మంచినీటి సమస్యలేని నగరంగా శ్రీకాకుళాన్ని తీర్చిదిద్దుతున్నాం.

– చల్ల ఓబులేసు, కమిషనర్, నగరపాలక సంస్థ, శ్రీకాకుళం.

విపక్షాల విమర్శలను ప్రజలు నమ్మడం లేదు

- రోడ్డు ప్రారంభంలో మంత్రి ధర్మాన ప్రసాదరావు



రోడ్డు శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): అభివృద్ధి, సంక్షేమాన్ని రెండు కళ్లుగా భావించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని రెవెన్యూ శాఖమంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. అయితే దీన్ని చూసి ఓర్వలేని విపక్షాలు అభివృద్ధి ఆగిపోయిందని చేస్తున్న దుష్ప్రచారాన్ని ప్రజలెవ్వరు నమ్మడం లేదని స్పష్టం చేశారు. శ్రీకాకుళం నగరంలోని రామకృష్ణ థియేటర్ వీధిలో రూ. 13.75 లక్షలతో పూర్తిచేసిన సిమెంట్ రోడ్డును మండవల్లి రవి ఆధ్వర్యంలో మంత్రి ధర్మాన ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నగరంలో రోడ్లు, మౌలిక సదుపాయాల్లేని వీధి ఉండకూడదన్నదే తమ లక్ష్యమన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా అభివృద్ధి పనుల కోసం ప్రతి డివిజన్‌కు రూ. 20 లక్షలు ఇచ్చామన్నారు. ఈ నిధులతో ప్రతి వార్డులో కావాల్సిన పనులను త్వరితగతిన పూర్తి చేస్తున్నామన్నారు. ప్రజలకు అవసరమైన చోట పనులు చేయాల్సి ఉంటే తక్షణమే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. చేసిన పనుల్లో నాణ్యతలేకుంటే సంబంధిత కాంట్రాక్టర్, అధికారులపై చర్యలు తీసుకుంటామన్నారు. నగరంలోని 80 అడుగుల రోడ్డు, పసగాడ మిల్లు జంక్షన్ నుంచి అరసవల్లి వరకు, జిల్లా పరిషత్ రోడ్డు, పాలకొండ రోడ్డు పనులను పూర్తి చేశామన్నారు. నగరంలో ఏ రోడ్డు పాడై ఉందన్న మాట వినిపించకూడదన్నారు.. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయంలో ఏమి చేశారన్న మాట ఏఒక్కరి నోట వినపించకుండా పనులు పూరిత చేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. జిల్లాలో మూలపేట పోర్టు, ఉద్దానం మంచి నీటి ప్రాజెక్టు, బుడగట్లపాలెం ఫిషింగ్‌హార్బర్, పలాసలో సూపర్‌స్పెషాలటీ ఆస్పత్రి వంటివన్నీ వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే నిర్మిస్తున్నామన్నారు. ఇవన్నీ అభివృద్ధి పనులు కావా.. ప్రతిపక్షాల కళ్లకు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. స్వాతంత్ర్యానంతరం ఏ ప్రభుత్వం రూ. వందలాది కోట్లు ఈ జిల్లాకు వెచ్చించి ప్రాజెక్టుల పనులు చేయలేదన్నారు. కేవలం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే ఇది సాధ్యమైందన్నారు. రిమ్స్‌లో 900 పడకల ఏర్పాటుచేసి అవసరమైన స్పెషాలటీ డాక్టర్లను నియమించి, అత్యాధునిక వైద్యపరికరాలు అందుబాటులో ఉంచి రోగులకు మంచి వైద్యం అందిస్తున్నామన్నారు. ప్రభుత్వ స్కూళ్లను నాడు-నేడు పథకం కింద కార్పొరేట్‌స్థాయిలో అభివృద్ధి చేశామని, డిజిటల్ క్లాస్‌రూమ్‌ల ఏర్పాటు, సిలబస్‌లో సమూల మార్పులు చేసి విద్యార్థులకు మంచి బోధనా సౌకర్యాలు కల్పించామన్నారు. అంతేకాకుండా పౌష్టికాహారం అందించడంతో పాటు తల్లుల ఖాతాల్లో డబ్బులు వేస్తున్నామన్నారు. అనేక కార్యక్రమాలు చేస్తున్నా ప్రతిపక్షాలు ఏమి చేయాలో తెలియక వారి మనుగడ కోసం విమర్శలు చేస్తున్నాయన్నారు. కార్యక్రమంలో కార్పొరేషన్ ఈఈ సుగుణాకరరావు, టీపీవో ఉమామహేశ్వరరావు, డీఈ రమణమూర్తి, తూర్పుకాపు, కళింగవైశ్య కార్పొరేషన్ చైర్మన్ మామిడి శ్రీకాంత్, అంధవరపు సూరిబాబు, డీసీఎంఎస్ చైర్మన్ గొండు కృష్ణమూర్తి, అంబటి శ్రీను, చల్ల శ్రీను, కోణార్క్ శ్రీను, కాపవరపు సీజు, పైడి మహేశ్వరరావు, గుమ్మా నగేష్, కిల్లాన బోజుకుమార్, అంధవరపు రమేష్ పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం



రణస్థలం: పుస్తక పఠనం చేస్తున్న విద్యార్థులు

రణస్థలం: పుస్తక పఠనంతో విద్యార్థులకు సంపూర్ణ జ్ఞానం కలుగుతుందని రణస్థలం శాఖా గ్రంథాలయాధికారి పి.వరలక్ష్మి అన్నారు. మండలంలోని శాఖా గ్రంథాలయంలో చదవడం మాకిష్టం కార్యక్రమంలో భాగంగా దిన పత్రికలు, కథలు చదివించడం, రాయించడంతోపాటు చిత్రలేఖనం పోటీలను పెట్టారు. ఈ సందర్భంగా గ్రంథాలయల్లో విజ్ఞాన పొందే ఎన్నో పుస్తకాలు ఉంటాయని, పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే విద్యార్థులు, విశ్రాంత ఉద్యోగులు గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.



ఎచ్చెర్ల: మాట్లాడుతున్న గ్రంథాలయ అధికారి శ్రీనివాసరావు

గ్రంథాలయాల్లో చదవడం మాకిష్టం

ఎచ్చెర్ల: లావేరు శాఖా గ్రంథాలయంలో ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులతో భాస్కర శతకం, వేమన శతకం పద్యాలను విద్యార్థులతో చదివించారు. బాగా చదివిన ముగ్గురు విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారి మురపాక శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతీ విద్యార్థి ప్రాథమిక స్థాయినుంచి పద్యాలు, వాటి భావాలను నేర్చుకోవాలన్నారు. గ్రంథాలయ సహాయకులు ఎ.గడ్డియ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

అర్హులు ఓటర్లుగా నమోదుకావాలి



మాట్లాడుతున్న సాయికుమార్

జి.సిగడాం: అర్హులైన యువతీ, యువకులు ఓటర్లుగా నమోదుకావాలని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి పిన్నింటి సాయికుమార్ పిలుపునిచ్చారు. మండలంలోని పెనసాం, సేతుభీమవరం గ్రామాల్లో ఆదివారం ఏర్పాటు చేసిన పార్టీ కార్యకర్తల సమావేశాలలో పాల్గొని మాట్లాడారు. డిసెంబర్ 9వ తేదీ లోగా ఓటు హక్కు కోసం నమోదు చేసుకోవాలన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విజయానికి పార్టీ శ్రేణులు సైనికుల్లా పని చేయాలన్నారు. జగనన్న అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. 2014 ఎన్నికల సమయంలో చంద్రబాబు ప్రజలకు 600 హామీలు ఇచ్చారని, ఏ ఒక్క హామీ అయినా అమలు చేశారా అని ప్రశ్నించారు. సర్పంచ్‌లు తొత్తడి రామారావు, బాలి రమేష్‌నాయుడు, నాగవరపు సాయికుమార్, త్రినాథరావు, పార్టీ అబోతుల జగన్నాథం, చందనాల రంగారావు, మహంతి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కోయ నృత్యం



కోయ నృత్యంలో కళాకారులు

ఇచ్ఛాపురం రూరల్: ఉత్కళాంధ్రుల ఆరాధ్య దైవంగా లొద్దపుట్టిలో పూజలందుకుంటున్న ధనరాజుల తులసమ్మ ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. ఒడిశా, ఆంధ్రా ప్రాంతాల నుంచి భక్తులు సంబరాలతో అమ్మవారి ఎదుట మొక్కుబడులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా తేలుకుంచి, ఇచ్ఛాపురం, ఒడిశా సుర్లా నుంచి వచ్చిన కోయనృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

వృద్ధులకు అన్నదానం

ఇచ్ఛాపురం: పట్టణంలోని సత్యసాయిసేవా సమితి ఆధ్వర్యంలో 30 మంది పేద వృద్ధులకు సత్యసాయిసేవాసమితి ఆధ్వర్యంలో దేవరపల్లి సుబ్బారావు, వజ్రపు రమణమూర్తి ఆదివారం మధ్యాహ్నం అన్నదానం చేశారు. సత్యసాయి సేవాసమితి సభ్యుల సేవాగుణాన్ని స్థానికులు కొనియాడారు.

క్రీడాకారులకు సత్కారం



బాల్ బ్యాడ్మింటన్ విజేతలతో ఎన్ఈఆర్

రణస్థలం: ఏపీ జూనియర్ అంతర్ జిల్లా బాల్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ విజేతలకు ఎన్ఈఆర్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో ఘనంగా సన్మానించారు. మండలంలోని బంటుపల్లి పంచాయతీలో ఉన్న ఎన్ఈఆర్ స్కూల్లో చైర్మన్ ఎస్.ఈశ్వరరావు, బాల్ బ్యాడ్మింటన్ జిల్లా కార్యదర్శి పి.మురళీకృష్ణంరాజు ఆధ్వర్యంలో క్రీడాకారులు, కోచ్‌లకు ఆదివారం సత్కరించారు. ఈ సందర్భంగా చైర్మన్ ఈశ్వరరావు మాట్లాడుతూ ఎన్ఈఆర్ స్కూల్ విద్యార్థులు జాహ్నవి, హర్షిని ఈ టీమ్‌లో భాగస్వాములుగా ఉండటం గర్వించదగ్గ విషయమన్నారు. చదువుతోపాటు ఆటలలోనూ రాణించాలన్నారు. అనంతరం జిల్లా కార్యదర్శి మురళీకృష్ణంరాజు మాట్లాడుతూ ఇండియన్ ప్రీమియర్ లీగ్ త్వరలో ప్రారంభం కానుందని, దానిలో ఒక ఫ్రాంచైజ్‌ను ఎన్ఈఆర్ స్కూల్ తీసుకోవటానికి అంగీకరించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బాల్ బ్యాడ్మింటన్ జాయింట్ సెక్రటరీ సీహెచ్ అరుణ్‌కుమార్, సెక్రటరీ అజయ్‌కమార్, ఎన్ఈఆర్ పాఠశాల డైరెక్టర్ ఎస్.తేజ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గౌరీ పౌర్ణమి ఉత్సవాలు



ఎచ్చెర్ల క్యాంపస్: ఫరీదుపేటలో కాటమరాజు వేషం



ఎచ్చెర్ల: లావేరు మండలం తామాడలో గౌరమ్మ ఉత్సవాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

ఎచ్చెర్ల క్యాంపస్: మండలంలోని పలు గ్రామాల్లో గౌరీ పౌర్ణమి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. ఫరీదుపేట, కొత్తపేట, కేశవరావుపేట, ఎస్ఎం పురం, బొంతలకోడూరు, పొన్నాడ తదితర గ్రామాల్లో ఈ ఉత్సవాలు కమిటీల నిర్వాహకులు నిర్వహించారు. గౌరీనందీశ్వరులకు ప్రత్యేక పూజలు చేశారు. పగటి వేషాలు ఆకట్టుకున్నాయి. యువత ఉత్సవాల్లో ఉత్సాహంగా పాల్గొంటున్నారు.

తామడలో..

ఎచ్చెర్ల: లావేరు మండలంలోని తామాడ గ్రామంలో గౌరమ్మ, నందన్న ఉత్సవాలను వేడుకగా నిర్వహించారు. గౌరమ్మ, నందన్నలను పురవీధుల్లో ఊరేగించారు. స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు.

అపూర్వ సమ్మేళనం



విశ్రాంత డీఈఓ ప్రభాకరరావును సన్మానిస్తున్న విజయనగరం జెడ్పీ చైర్మన్ చిన్నశ్రీను

జి.సిగడాం: వారంతా సుమారుగా 50 ఏళ్ల క్రితం విజయనగరం ఎంఆర్ కాలేజీలో చదువుకున్నారు. ప్రతి ఒక్కరూ ఉన్నత స్థాయిలో స్థిరపడ్డారు. మండలంలోని సేతుభీమవరం తోటలో విశ్రాంత డీఈఓ అబోతుల ప్రభాకరరావు ఆధ్వర్యంలో ఆదివారం ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి విజయనగరం జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు మీసాల వెంకటరమణ, జెడ్పీటీసీ సభ్యుడు కాయల రమణ, జేఎస్‌సీ కన్వీనర్ జోల వెంకటరమణ, పార్టీ మండల అధ్యక్షుడు బత్తుల సన్యాసిరావు, జిల్లా కార్యవర్గ సభ్యుడు పిల్లల శివకుమార్, వైఎస్సార్‌సీపీ నాయకులు బూరాడ వెంకటరమణ, తొత్తడి రామారావు, అబోతుల జగన్నాథం, బాలి రమేష్, సాకేటి నాగరాజు, వివిధ ప్రాంతాల నుంచి పూర్వ విద్యార్థులు, ఉద్యోగస్తులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రభాకరరావును సన్మానం చేశారు.

రాముడు విశేషజ్ఞుడు

శ్రీకాకుళం కల్చరల్:



రామసుబ్బారావును సత్కరిస్తున్న సభ్యులు

రాముడు విశేషజ్ఞుడు అని, స్వధర్మ రక్షకుడని విజయనగరానికి చెందిన విశ్రాంత తెలుగు పండితుడు రాళ్లపల్లి రామసుబ్బారావు అన్నారు. స్థానిక ఉపనిషన్మందిరంలో వాల్మీకి జయంతి ఉత్సవాల సందర్భంగా సీతమ్మ-హనుమ ధర్మసంవాదంపై ఆదివారం ప్రసంగం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. త్వరగా రాముని దర్శనం చేసుకునే భాగ్యం కలిగించాలని సీతమ్మ హనుమను కోరిందన్నారు. ముందుగా వక్త రామసుబ్బారావును మందిరం సభ్యులు సత్కరించారు. కార్యక్రమంలో డాక్టర్ ఎన్ఎస్ఎన్ స్వామి, సనపల నారాయణమూర్తి, కోమలరావు, ఎం.ప్రసాదరావు, పెద్ది ఈశ్వరరావు, సరస్వతి, అరుణకుమారి ఉన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో పెట్టుబడి ఆదా

ఎల్.ఎన్.పేట: ప్రకృతి వ్యవసాయ సాగు పద్ధతులతో పెట్టుబడి తగ్గుతుందని ప్రకృతి వ్యవసాయం ఐసీఆర్పీలు అన్నారు. మండలంలోని చొర్లంగి గ్రామంలో ప్రకృతి వ్యవసాయం సాగు పద్ధతులపై ఆదివారం రైతులకు అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయంతో రసాయన ఎరువులు, పురుగు మందుల ఖర్చు తగ్గుతుందన్నారు. ప్రకృతి వ్యవసాయ సాగు పద్ధతుల్లో పంటలు పండించే రైతుల వివరాలను సేకరించటం జరుగుతుందన్నారు. సేంద్రియ పద్ధతుల్లో దిగుబడులు సాధించిన పంట ఉత్పత్తులను మార్కెటింగ్ సౌకర్యం కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. వరి పంట కోతల తరువాత అపరాల పంటలతోపాటు తీగజాతి, ఆకుకూరలు, చిరుధాన్యాల పంటలు వేసుకోవాలన్నారు.

ప్రకృతి వ్యవసాయమే శ్రేయస్కరం

హిరమండలం: ప్రకృతి వ్యవసాయమే శ్రేయస్కరమని ప్రకృత్యి వసాయ ఎంసీఆర్‌ఎఫ్ రాములమ్మ అన్నారు. హిరమండలంలోని నౌగూడ గ్రామంలో ప్రకృతి వ్యవసాయంపై రైతులతో ఆదివారం యూనిట్ లెవల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జీవామృతం తయారీ, పంట కోత ప్రయోగం, సీజనల్ వారి కషాయాల తయారీపై అవగాహన కల్పించారు. ఐసీఆర్‌పీ తేజ, రైతులు పాల్గొన్నారు.

వైద్యం కోసం రూ. 20 వేల సాయం

వజ్రపుకొత్తూరు: పెద్దమురహరిపురంలోని సాగర్ కాలనీకి చెందిన భద్రాచలం తారకేశ్వరరావు గుండెకు సంబంధిత వ్యాధితో శ్రీకాకుళంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. వైద్యానికి రూ.8 లక్షలు ఖర్చవుతుందని వైద్యులు ప్రకటించారు. దీంతో నిరుపేద అయిన తారకేశ్వరరావుకు అండగా పూండికి చెందిన యువతరం సేవా సమితి సభ్యులు తమవంతుగా రూ. 20 వేలు ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో సేవా సమితి అధ్యక్షుడు చింత మురళి, సభ్యులు గొరకల అశోక్, బడే ధనుంజయ్, ఎన్.గణేష్, కె.సింహాచలం, దానేష్, గణేష్, లక్ష్మణ్, నాగేశ్వరరావు, టి.మురళి, నరేష్, భాస్కరరావు పాల్గొన్నారు.

శివాలయాల్లో గ్రహణదోష నివారణ పూజలు



ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

కవిటి: మండలంలోని వివిధ శివాలయాల్లో ఆదివారం చంద్రగ్రహణ దోషం కలిగిన నక్షత్రరాశుల వారు గ్రహణ దోష నివారణ పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. చంద్రగ్రహణం సందర్భంగా ఆలయాలను సంప్రోక్షణ నిర్వహించిన అనంతరం వేకువజాము నుంచే భక్తులు శివాలయాల్లో పూజలకోసం బారులు తీరారు. ఒరియా సంప్రదాయంలో కార్తీక మాసదీక్షలు కూడా తోడవడంతో మండలంలోని వివిధ ఆలయాల్లో ఒరియా మాట్లాడే వారంతా ప్రత్యేక పూజలు చేశారు.



